క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పాళ్యంతండాలో ప్రచారం చేస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని పాళ్యంతండా, పాళ్యం, అప్పాజీపేట గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవాసమితి–ఇందు జ్ఞాన వేదిక గుంతకల్లు, నాగసముద్రం కమిటీల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారంముమ్మరంగా నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా సమితి కమిటీల అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ, సభ్యులు దొనప్ప, త్రివేణి, లక్ష్మీదేవి, సర్వజ్ఞ, వరలక్ష్మి, సాయి, రాజు, రాధ పాల్గొన్నారు.

గన్‌మెన్ సస్పెండ్ దారుణం



వై.భీమిరెడ్డి

గుంతకల్లు: సీనియర్ శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేయి ఫ్యాక్చర్ కావడంతో సాయం చేసిన పాపానికి గన్‌మెన్‌ను సస్పెండ్ చేయడం దారుణమని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి తనయుడు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు వై.భీమిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన గుంతకల్లుకు విచ్చేసిన సందర్భంగా సాక్షితో మాట్లాడారు. మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఇటీవల చెయ్యి ఫ్యాక్చర్ కావడంతో ఆపరేషన్ జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రాజమండ్రి జైల్లో ఉండగా పరామర్శించడానికి రామచంద్రారెడ్డి అక్కడ వెళ్లారు. ఆయన బ్యాగును మోయలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో.. గన్‌మెన్ కాలేషా మానవతా దృక్పథంతో బ్యాగు తీసుకున్నందుకు మూడు నెలలు పాటు సస్పెండ్ చేయడం దారుణమన్నారు. చేయి విరిగి, బ్యాగు మోయలేని స్థితిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని తెలిసి కూడా చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ అత్యుత్సాహం ప్రదర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. గన్‌మెన్ కాలేషా సస్పెండ్‌ను వెంటనే ఎత్తివేసి, కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలకాలన్నారు.

ఐద్వా కార్యవర్గం ఎన్నిక



ఐక్యత చాటుతున్న ఐద్వా కార్యవర్గ సభ్యులు

గుంతకల్లుటౌన్: ఐద్వా గుంతకల్లు పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షురాలు శ్యామల తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కాలనీలో ఐద్వా పట్టణ 5వ మహాసభ నిర్వహించారు. ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.జ్యోతి, రంగమ్మతో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయన్నారు. కూటమి సర్కారు మహిళలకిచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాడుతామన్నారు. ఐద్వా సభ్యులు సుగుణ, షకీరా, లక్ష్మీబాయి, జయమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

గుంతకల్లు: మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీరావు నూతనంగా ఎన్నికైన మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుగాలి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ కురవ రాణాప్రతాప్, 17 మంది మెంబర్లు చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, రామన్నచౌదరి, జనసేన నాయకుడు మణికంత, బీజేపీ నాయకులు కొలిమి రామాంజినేయులు, పసుపుల హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు



తాడిపత్రి రూరల్: మండలంలోని ఆర్టీటీ కాలనీలో మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.40,200 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆదివారం అప్‌గ్రేడ్ ఎస్ఐ ధరణిబాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన చెన్నప్పనాయక్, టైలర్స్‌కాలనీలోని పాండురంగడును అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

- కనిపించని కనీస సౌకర్యాలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ వసతి గృహాలల్లో సమస్యలు తిష్టవేశాయి. కొంత మంది వార్డెన్లు రెండు మూడు హాస్టల్‌లకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుండటంతో.. వారానికి రెండు మూడు సార్లు చుట్టపుచూపుగా హాస్టళ్లకు వస్తున్నారు. ఇదే అదునుగా కొంతమంది వార్డెన్‌లు సొంతత పనుల్లో నిమగ్నమవుతుండటంతో స్వీపర్లు, వంట మనుషులు, వాచ్‌మెన్‌లే వార్డెన్‌లుగా వ్యవహరిస్తున్నారు. చాలా వసతి గృహాలకు ప్రహరీ లేక విద్యార్థులకు రక్షణ కరువైంది. మరుగుదొడ్లు లేక పోవడంతో విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తాడిపత్రి పట్టణంలో రెండు బీసీ, మూడు ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి. తాడిపత్రి రూరల్ పరిధిలోని చుక్కలూరులో ఒక ఎస్సీ హాస్టల్ ఉంది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కొన్ని హాస్టళ్లలో మరమ్మతులు చేస్తుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మరుగుదొడ్లు వాడుకలో లేకపోవడంతో



తాడిపత్రి మండలం చుక్కలూరులోని హాస్టల్‌లో ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు అవసరాలకు బయటకు వెళ్లాల్సి వస్తోంది. పెద్దపప్పూరు మండలంలో బీసీ బాలుర హాస్టల్, జూటూరు గ్రామంలో ఎస్సీ బాలికల హాస్టల్ ఉన్నాయి. రెండు హాస్టళ్లలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జూటూరు హాస్టల్ భవనానికి మరమ్మతులు చేస్తుండటంతో స్థానికంగా వున్న ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులు ఉంటున్నారు. పెద్దవడుగూరు మండలంలో మూడు వసతి గృహాలున్నాయి. రెండు మండలకేంద్రంలో ఉండగా దిమ్మగుడి గ్రామంలో ఒక్క వసతి గృహం వుంది. ఆయా వసతి గృహాల్లో డ్రైనేజీ సమస్య కారణంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో విద్యార్థులు రాత్రి పూట జాగరణ చేయాల్సి వస్తోంది.

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, గురుకుల హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ వందలాది విద్యార్థులు ఉంటున్నారు. ఈ హాస్టళ్ల ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వది. అయితే అధికారుల అలసత్వం..ప్రభుత్వం నిర్లక్ష్యం వెరిసి హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోతున్నాయి. గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా మూడు కేజీబీవీ, రెండు మోడల్ స్కూల్, 10 హాస్టళ్లు ఉన్నాయి. గుంతకల్లు పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లోని బీసీ బాయ్స్ హాస్టళ్ల సమీపంలో శ్మశాన వాటిక ఉండటంతో రాత్రి పూట విద్యార్థులు భయంతో నెట్టుకొట్టుస్తున్నారు. అంతేకాకుండా అన్నం సరిగా ఉడకపోవడం లేదా ముద్దగా కావడంతో విద్యార్థులు తినలేకపోతున్నారు. కిటికీలు సరిగా లేకపోవడంతోపాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు దండయాత్ర చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఇక మండలంలోని పాతకొత్తచెరువులో ఉన్న హాస్టళ్లలోని గదులు శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అంతేకాకుండా మరుగుదొడ్లు నిర్వహణ లోపం కారణంగా దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. దీంతో కాలకృత్యాలకు సమీపంలో కొండ ప్రాంతానికి వెళ్తున్నామన్నారు. వార్డెన్ అందుబాటులో ఉండరని విద్యార్థులు వాపోతున్నారు.

పామిడి: పామిడి ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతి గృహంలో 3 నుంచి 9వ తరగతి వరకూ 32 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖ రూ.19 లక్షల నిధులతో హాస్టల్‌ను పునరుద్దరణ పనులైతే చేపట్టింది. కానీ హాస్టల్ ప్రవేశ ద్వారం ముందు ఓహెచ్‌ఆర్ ట్యాంకు పిల్లర్ల నిర్మాణ గుంత, రాడ్స్ వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. అలాగే హాస్టల్‌లోని గదుల్లో పిల్లలకు మంచాలు లేకపోవడంతో కిందనే పడుకోవాల్సిన పరిస్థితి. దీంతో పిల్లలకు విషపురుగుల బెడద లేకపోలేదు. ఇకపోతే హాస్టల్‌కు ఇన్‌చార్జ్ వార్డెన్ ఆదినారాయణ చుట్టపురీతిగా వచ్చి వెళ్తుంటారు. దీంతో హాస్టల్‌కు వంటమనిషి జయమ్మనే పెద్దదిక్కయ్యారు. ఇటీవల హాస్టల్ మరమ్మతుల్లో భాగంగా నిర్మించిన ప్రహరీ ప్లాస్టింగ్‌కు నోచుకోకపోగా, ప్రహరీ తక్కువ ఎత్తులో నిర్మించడంతో పిల్లలకు అభద్రతా భావం లేకపోలేదు. పాత గేటునే ఏర్పాటు చేయడం సైతం పిల్లల భద్రతకు రక్షణ లేకుండా పోయింది.



పామిడిలోని హాస్టల్ గదిలో మంచాలు లేని దృశ్యం

వసతి గృహాల్లో అన్నీ సమస్యలే

శింగనమల: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఇక్కట్లతో విద్యార్థులు సతమతమవుతున్నారు. నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర , బాలికల వసతి గృహాలు 16 ఉన్నాయి. శింగనమల మండల కేంద్రంలో ఎస్సీ బాలుర, బీసీ బాలుర, కేజీబీవీ –4 బాలికలు, తరిమెలలో ఎస్సీ బాలుర వసతి గృహాలున్నాయి. ఎస్సీ బాలుర వసతి గృహంలో 54 మంది విద్యార్థులున్నాయి. వసతి గృహం ఆవరణలో ఉన్న బోరులో భూగర్భజలం అడుగంటడంతో నీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న బోరులో కేవలం కొంత సేపు మాత్రమే నీరు రావడంతో వాటితోనే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బీసీ బాలుర వసతి గృహంలో మరమ్మతులకు రూ.4 లక్షలు నిధులున్నా పనులు చేయలేదు. నూతనంగా ఏర్పాటు చేసిన కేజీబీవీ –4 బాలికల వసతి గృహం ఆవరణలో మోటారు పని చేయకపోవడంతో విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మోటార్ మంజూరు చేయాలని కోరుతున్నారు. అలాగే తరిమెల ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులకు నోచుకోలేదు.



శింగనమల ఎస్సీ బాలుర వసతి గృహంలో నీరు సరిగా రాని బోరు

కొరవడిన మౌలిక సదుపాయాలు



గుత్తిలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో అధ్వానంగా ఉన్న బాత్‌రూమ్

గుత్తి: గుత్తి పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ భవనం అధ్వానంగా ఉంది. బాత్ రూమ్స్, టాయిలెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అదీగాక 265 మంది విద్యార్థులకు కేవలం ఆరు గదులే ఉన్నాయి. దీంతో రాత్రి వేళ పడుకునేందుకు విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తున్నది. అదే విధంగా నంబర్–1 ఎస్సీ బాలుర వసతి గృహం భవనం కూడా శిథిలావస్థకు చేరువైంది. బాత్ రూమ్‌లు సరిపడినన్నీ లేవు. భోజనం నాణ్యత కూడా సరిగా లేదని విద్యార్థులు వాపోతున్నారు. గుత్తిలో పాటు మండల వ్యాప్తంగా ఉన్న వసతి గృహాలు పరిస్థితి దారుణంగా ఉంది. నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదు. నీళ్ల పప్పు, ఉడకని అన్నం పెడుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు

మోసం చేయడమే చంద్రబాబు నైజం



యాడికి మండల తూట్రాళ్లపల్లిలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ సంజీవరాయుడు



పుట్లూరు మండలం గోపురాజుపల్లిలో రీ కాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



గార్లదిన్నె మండలం శిరివరంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం..



శింగనమల మండలం శివపురంలో రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం..

యాడికి/పుట్లూరు/గార్లదిన్నె/శింగనమల: ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసగించారని, బాబు అంటేనే మోసం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు మండిపడ్డారు. ఆదివారం యాడికి మండలంలోని తూట్రాళ్లపల్లి, దైవాలమడుగు, బోయరెడ్డిపల్లిలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ సంజీవరాయుడు ఆయా గ్రామాల నాయకులు మోపిరెడ్డి, మారుతి తదితరులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో అరాచక పాలన చేస్తోందన్నారు. ఇంటింటా తిరుగుతూ చంద్రబాబు వంచనను వివరించారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, ముత్యాలరెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, గురప్ప, రామాంజనేయులు, రంగస్వామి, దైవాలమడుగు మోపిరెడ్డి, బోయరెడ్డిపల్లి మారుతి, రామకృష్ణ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

▶▶ పుట్లూరు మండలంలోని సి.వెంగన్నపల్లి, గోపురాజుపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి, నాయకులు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శివారెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, అంబటి రామమోహన్, బహేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, రమాకాంత్‌రెడ్డి, విజయ్ , విశ్వనాథ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

▶▶ గార్లదిన్నె మండలంలోని శిరివరం, గుడ్డాలపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లా రెడ్డి ఎంపీపీ వెంకటనారాయణ, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, శింగనమల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగరాజు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

▶▶ శింగనమల మండలంలోని పెరవలి, పోతురాజుకాల్వ, చక్రాయిపేట, సీ.బండమీదపల్లి, శివపురం గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వీరాంజనేయులు,మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ మెంబరు ఆలీ, వెంకటప్ప, రమణారెడ్డి, గోపీ , నారాయణస్వామి, ఓబిరెడ్డి, పరంధామ రెడ్డి, ఎస్‌పి నారాయణరెడ్డి, మహేంద్ర, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గోవిందపల్లిలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి పంచాయతీలోని బోయ కొట్టాల, గోవిందపల్లి, భద్రంపల్లి, జంతలూరు గ్రామాల్లో సోమవారం సాయంత్రం నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా రేణకా యల్లమ్మ విగ్రహ ప్రతిష్ట

యాడికి: మండలంలోని రామరాజుపల్లిలో ప్రజల విరాళాల ద్వారా దాదాపు రూ.75 లక్షలతో నిర్మించిన రేణుకా యల్లమ్మ తల్లి దేవాలయాన్ని గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. నూతన ఆలయ ఆవరణలో ఎల్లమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి 4 గంటల వరకూ యంత్ర ప్రతిష్ట తదితర పూజలు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఉదయం 5గంటల సమయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. ఆలయ నిర్మాణం కోసం 18 సెంట్ల స్థలం ఉచితంగా ఇచ్చిన బెంగుళూరులో స్థిరపడిన రామరాజుపల్లి గ్రామానికి చెందిన శిరిగే నారాయణ స్వామి కుమారులు రవికుమార్, బాబు, ప్రశాంత్‌కుమార్, శ్రీహరి తమ కుంటుంబ సభ్యులతో కలిసి వచ్చి మద్యాహ్నం 1 గంట సమయంలో అమ్మవారి ప్రథమ దర్శనం చేసుకున్నారు. అలాగే భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.



అలంకరణలో రేణుకా యల్లమ్మ అమ్మవారు

సమస్యలు సృష్టిస్తే కేసుల నమోదు

పెద్దపప్పూరు/పెద్దవడుగూరు: ఆధిత్యం కోసం సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని రౌడీ షీటర్లను ఎస్ఐ నాగేంద్ర ప్రసాదు హెచ్చరించారు. ఆదివారం ఆయన పెద్దపప్పూరు మంలవ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును దృష్టిపెట్టుకుని సమస్యల జోలికి వెళ్లకుండా ప్రశాంతగా జీవించాలన్నారు. అలాగే పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ ఆంజనేయులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్ల కదలికపై నిఘా పెట్టామన్నారు నేరాలకు పాల్పడినట్లు తెలిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయడంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30న కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బార్ మియా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమైన అంశాల గురించి చర్చిస్తామని, మున్సిపల్ అధికారులు, పాలక వర్గం తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

గుంతలోకి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కూరగాయాల మార్కెట్ సమీపంలో ఓ హోటల్ వద్ద ఉన్న గుంతలోకి ప్రమాదవశాత్తు జారి పడి వెంకటరమణ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎంగిలి బండకు చెందిన వెంకటరమణ తన స్నేహితుడితో కలిసి హోటల్లో టీ తాగడానికి వెళుతుండగా అక్కడ ఉన్న గుంతలో పడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

బెల్టు షాపుపై దాడులు

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో ఆదివారం బెల్టు షాపులపై దాడులు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో రఘు అనే వ్యక్తి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 90 బాటిళ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యాచకుడి మృతదేహానికి అంత్యక్రియలు

గుంతకల్లుటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని ఓ యాచకుడి మృతదేహానికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు అనాథ మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికలో ఖననం చేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు చక్రపాణి, కేశవ, రత్న, రవీంద్ర, రాము, ఆటోవేణు, నవీన్, అంజి పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో శనివారం అర్ధరాత్రి మిద్దె పైనుంచి పడి లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. యాడికి మండల కేంద్రానికి చెందిన అతడు కోటలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభ కార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. రాత్రి మిద్దెపై నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో మూత్ర విసర్జన కోసం మిద్దె దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. రాయిపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అబ్దుల్ కలాం దార్శనికుడు

గుంతకల్లుటౌన్/గుత్తి: భారత గగనతల మేధావి, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తిదాయక దార్శనికుడని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎం.ఎం.రెహమాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో వర్ధంతి సందర్భంగా గుంతకల్లు పట్టణంలోని 60 అడుగుల రోడ్‌లోని కలాం విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పోలింగ్‌బూత్ కన్వీనర్ ఎంబీ.మౌలా, దూదేకుల కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ పి.వలి, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, నాయకులు రాఖీ, దాదా,గఫార్‌ఖాన్, నూర్, మసూద్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ఆదివారం మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబూ బకర్, స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు

అశ్వత్థంలో భక్త జన సందోహం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థం క్షేత్రానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్రావణమాసం తొలి ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వరుల చుట్టూ ప్రదక్షణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు ముడుపులు, కానుకలతోపాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు.

కోటంకలో పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకార్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అశ్వత్థంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్సిడీతో గడ్డి విత్తనాలు

శింగనమల: పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం ఆదివారం తెలిపారు. గడ్డి విత్తనాలు రూ.92 కాగా, సబ్సిడీ పోను రూ.23కే అందజేస్తామన్నారు. ఒక్కో పాడి రైతుకు 30 కేజీల వరకూ విత్తనాలు అందిస్తామన్నారు. శింగనమల, సలకం చెర్వు, తరిమెల, గార్లదిన్నె , ఎర్రగుంట్ల, బుక్కరాయసముద్రం, కొర్రపాడు, నార్పల, బి.పప్పూరు, గూగూడు పశువైద్యశాల , నీలాంపల్లి, వెస్ట్ నరసాపురం రైతు సేవా కేంద్రాల్లో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గుత్తిలో తెరచాప సినిమా షూటింగ్



ఎంఎస్ హైస్కూల్లో సినిమా షూటింగ్ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో ఆదివారం అనన్య క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తెరచాప మూవీ చివరి షెడ్యూల్‌ను చిత్రీకరించారు. తుఫాన్, విష ఆహారం తిని పిల్లలు ఆస్పత్రి పాలైన సన్నివేశాలను దర్శకుడు జోయల్ జార్జ్ ఎంఎస్ హైస్కూల్, రాజా తోట ప్రాంతాల్లో షూటింగ్ చేశారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి షూటింగ్‌ను వీక్షించారు. షూటింగ్ కార్యక్రమాల్లో నిర్మాత దుర్గం కై లాష్, హీరో నవీన్ రాజ్, హీరోయిన్ పూజా, విలన్ రాజేష్ నాయక్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ నాగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.